అన్ని రంగాల్లో ఆదర్శంగా శ్రీకాళహస్తి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే ధ్యేయమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇలగనూరు సచివాలయం పరిధిలోని గుర్రప్పనాయుడు కండ్రిగ, కొణతనేరి, హరిజనవాడ గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు మహిళలు మంగళ హారతులతో ఆత్మీయ స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమన్నారు. అర్హతే ప్రమాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో పారదర్శంగా పథకాలను ఇంటి ముంగిటకే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సమస్యలుంటే శ్రీకాళహస్తిలోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి వచ్చి తెలియజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉన్నం వాసుదేవనాయుడు, నాయకులు మోహన్ కిషోర్ నాయుడు, రమణయ్య నాయుడు, హరి నాయుడు, మునిరత్నం, తహశీల్దార్ సుధీర్ రెడ్డి, ఎంపీడీవో తరుణాక్షిరెడ్డి, సీఐ విక్రమ్, జెడ్పీటీసీ సభ్యురాలు అర్చనాదేవి, సర్పంచ్ గాలి బాలాజీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం తొట్టంబేడ్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ వద్ద అంగన్‌వాడీలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని కోరారు. సూపర్‌వైజర్ పోస్టుల భర్తీలో వయో పరిమితి తొలగించాలని డిమాండ్ చేశారు. రాజేశ్వరి, రేవతి, పూర్ణ చెంగమ్మ, యశోద, ఉషారాణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణ నేరం



మాట్లాడుతున్న ఎస్‌ఐ మంజునాథరెడ్డి

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ భూములను ఆక్రమించడం చట్టరీత్యా నేరమని ఎస్‌ఐ మంజునాథరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం బుచ్చినాయుడుకండ్రిగలోని ప్రభుత్వ భూమి ఆక్రమణలను అడ్డుకున్నారు. ఇంటి స్థలాలు లేక ఇబ్బంది పడుతున్నామని, అందుకే ఆక్రమించుకున్నామని ఆక్రమణదారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీగా ఉన్నాయని ప్రభుత్వ భూములు ఆక్రమించుకోకూడదని, ఇంటి స్థలాలు కావలసిన వారు రెవెన్యూ అధికారులకు విన్నవించి, పట్టా పొందాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు వెంకటమ్మ, జనార్దన్ పాల్గొన్నారు.

ఇంటి స్థలాల కోసం వినతి



తహసీల్దారుతో మాట్లాడుతున్న వామపక్షాల నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలో ఇంటి స్థలాలు లేని బీసీ, ఎస్టీ, ఎస్సీ కాలనీకి చెందిన వారికి స్థలాలను ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నిరాజ్, మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, సీపీఐ మండల కార్యదర్శి రమణయ్య బుధవారం తహసీల్దారు చంద్రశేఖర్‌నాయుడుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థలాలు లేక ఒకే ఇంటిలో మూడు కాపురాల ఉంటున్న వారు ఉన్నారని విన్నవించారు. ప్రభుత్వ భూమిని గుర్తించి, అర్హులైన వారికి ఇంటి పట్టాలు ఇవ్వాలని తెలిపారు. దీనిపై స్పందించిన తహసీల్దారు చంద్రశేఖర్‌నాయుడు మాట్లాడుతూ అర్హులైన వారందరికి ఇంటి స్థలాలు ఇస్తానని హామీ ఇచ్చారు.

పుస్తకాల వితరణ

నారాయణవనం: మండలంలోని ప్రభుత్వ స్కూళ్లకు శ్రీ సరస్వతీమాత సాంఘిక సేవా సమాజం వారు ఆణిముత్యాలు, పద్యాల సరాలు పుస్తకాలను బుధవారం అందజేశారు. ఎమ్మార్సీ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఎంఈఓ భారతికి సమాజం ప్రతినిధులు పుస్తకాలను అందజేశారు. విద్యార్థులకు విద్యతో పాటు మంచి ప్రవర్తనతో పాటు తెలుగు సాహిత్యంపై మక్కువ పెంచడానికి, సామాజిక బాధ్యత, నైతిక విలువలు పెంపొందించడానికి పుస్తకాలు ఎంతగానో ఉపకరిస్తాయని వారు తెలిపారు. కార్యక్రమంలో సమాజం సభ్యులు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



నియామక పత్రాలు అందజేస్తున్న ఆల్‌స్టామ్, మ్యాజిక్ బస్ ప్రతినిధులు

వరదయ్యపాళెం: మండల కేంద్రంలో ఆల్‌స్టామ్, మ్యాజిక్ బస్ ఫౌండేషన్ వారు నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. వివిధ విద్యార్హతలు కలిగిన 286 మంది జాబ్‌మేళాకు హాజరుకాగా, 136 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఆల్‌స్టామ్, మ్యాజిక్ బస్ ప్రతినిధులు అరుణ, జ్యోత్స్న, గోపి, పూర్ణిమ పాల్గొన్నారు.

బాలకృష్ణ క్షమాపణలు చెప్పాలి

శ్రీకాళహస్తి: బాలకృష్ణ క్షమాపణలు చెప్పాలని అక్కినేని అభిమానుల సమాఖ్య పట్టణ అధ్యక్షుడు మోరుకొండ వెంకటముని డిమాండ్ చేశారు. ఈనెల 22న జరిగిన ఓ సినిమా ఫంక్షన్‌లో బాలకృష్ణ మహానటుడు అక్కినేని నాగేశ్వరరావును అక్కినేని, తొక్కినేని అని కించపరచడం బాధాకరమన్నారు. ప్రజాప్రతినిధి, సినీ హీరోగా ఉండి ఇలా మాట్లాడడం భావ్యంకాదన్నారు.

తపాలా ఉద్యోగుల నిరసన

గూడూరు: ఆచరణకు సాధ్యంకాని లక్ష్యాలను ఇస్తూ, వాటిని పూర్తిచేయాలని ఒత్తిడి చేయడం దారుణమని పోస్టల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డివిజన్ నాయకులు కామ్రేడ్ ఆర్ గోవింద్ నాయక్ పేర్కొన్నారు. స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం వద్ద బుధవారం తపాలా ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కేవీబీపురం: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య తెలిపారు. గురువారం ఉదయం 9 గంటలకు మండలంలోని కాట్రపల్లి సచివాలయం వద్ద గణతంత్ర వేడుకల్లో పాల్గొని, 10 గంటలకు తేజో భారత్ కార్యక్రమం ద్వారా ఉచిత హోమియోపతి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సుమారు 5000 మందికి హోమియోపతి వైద్యం అందించి, మందులను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్, ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. మండల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని హోమియో మందులు పొందాలని పేర్కొన్నారు.

సామూహిక కుంకుమార్చన రేపు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ముత్యాలమ్మగుడివీధిలో వెలసిన శ్రీనింబుజాదేవి ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నట్లు హిందూధర్మప్రచార మండలి జిల్లా సభ్యులు పోతుల రాజకుమార్, ఆలయ ధర్మకర్త విశ్రాంత డీఎస్పీ దళవాయి రఘుశెట్టి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు సామూహిక కుంకుమార్చన, 7గంటలకు సౌభాగ్య మాంగల్య దారాలు, లక్ష కుంకుమార్చన ప్రసాదం పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సమస్యల పరిష్కారం కోసం 30న సమ్మె

శ్రీకాళహస్తి రూరల్: యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్ పిలుపు మేరకు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30, 31న సమ్మెకు దిగుతున్నట్లు యూనియన్ పట్టణ అధ్యక్షుడు మునెయ్య తెలిపారు. బుధవారం శ్రీకాళహస్తి భారతీయ స్టేట్ బ్యాంక్ ప్రధాన బ్రాంచ్ వద్ద భోజన విరామ సమయంలో సభ్యులతో కలసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. స్టాఫ్ రిక్రూట్‌మెంట్ చేపట్టాలని అన్నారు. వేతన సవరణ, పాత బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. మేనేజర్ స్వప్నప్రియ, యూనియన్ సభ్యులు మల్లీశ్వరి, లావణ్య, ప్రియ, భార్గవి, పూజ, గోపీనాథ్, మణి, అరుణ్‌ప్రసాద్, వెంకటేష్, బాలకృష్ణారెడ్డి, సురేష్ పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బ్యాంకు ఉద్యోగులు

మృతురాలి కుటుంబానికి సాయం



నగదును అందిస్తున్న కిషోర్ రెడ్డి

ఏర్పేడు: మండలంలోని గోవిందవరం ఎస్టీ కాలనీలో మృతురాలి కుటుంబానికి బుధవారం వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి ఆర్థిక సాయం చేశారు. కాలనీకి చెందిన రామక్క 65) అనారోగ్యంతో మృతి చెందింది. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు కిషోర్ రెడ్డి గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులు అర్పించి, దహన క్రియలకు రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే చేయూత

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని రామచంద్రాపురానికి చెందిన కె.వెంకటయ్య, రాజీవ్‌నగర్‌కు చెందిన దూదేకుల నాగూర్‌బాషా బుధవారం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించడానికి కుమారుడు ఆకర్ష్ రెడ్డిని పంపారు. అనంతరం దహన క్రియల ఖర్చులకు రూ.10 వేల చొప్పున ఇరు కుటుంబాల సభ్యులకు అందజేశారు. మృతుల కుటుంబాలకు అన్ని వేళలా అండగా ఉంటామని వారికి తెలియజేశారు. వైఎస్సార్ సీపీ మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న బియ్యపు ఆకర్ష్ రెడ్డి

ద్విచక్ర వాహనదారుడిపై కేసు నమోదు

ఏర్పేడు: మండలంలోని వికృతమాల సమీపంలో డిక్షన్ కర్మాగారం వద్ద నడిచి వెళుతున్న ఓ వ్యక్తిని ద్విచక్ర వాహనంతో ఢీకొని గాయపరచిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి బుధవారం రాత్రి తెలిపారు. వివరాలు.. బీహార్ రాష్ట్రానికి చెందిన ఉపేంద్ర రాజు ఈ నెల 23న రాత్రి డిక్షన్ కర్మాగారం వద్ద కాలినడకన వెళుతుండగా వెనుక వైపు నుంచి ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉపేంద్ర రాజును చికిత్స కోసం తిరుపతి రుయాకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం వేలూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన మండలంలోని చెల్లూరుకు చెందిన సుబ్రమణ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

బస్సు యాత్ర పోస్టర్ల ఆవిష్కరణ

శ్రీకాళహస్తి రూరల్: ప్రత్యేక హోదా సాధనకై ఈ నెల 27న విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో శ్రీకాళహస్తికి వచ్చే బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఏఐఎస్‌ఎఫ్, టీఎన్‌ఎస్‌ఎఫ్,పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో బుధవారం బస్సు యాత్ర వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సంఘాల నాయకులు మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన చట్టంలోని హామీలు నెరవేర్చాలని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో బస్సు యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉదయ్‌కుమార్, సురేష్, మునిచందు, లక్ష్మణ్, హేమంత్, అనిల్, పవన్, ఠాగూర్ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న విద్యార్థి నాయకులు

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం



శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయ కూడలి వద్ద విద్యార్థుల మానవహారం





పాపానాయుడుపేటలో మానవహారం, నారాయణవనం: ర్యాలీలో డీఈఓ, తహసీల్దార్



వరదయ్యపాళెం హైస్కూల్‌లో ..



పిచ్చాటూరు జెడ్పీ హైస్కూల్లో..

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని ఎస్పీవీఏ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కేసి రేణుకమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ సుధాకర్ మాట్లాడుతూ నేటి విద్యార్థులే రాబోయే తరానికి దేశ భవిత నిర్దేశించే నాయకులని, ఓటు దేశభద్రతకు ఎంతో ముఖ్య మని తెలిపారు. అనంతరం కళాశాల నుంచి విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయ కూడలి వద్ద మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ సుధీర్ రెడ్డి, ఎంఈఓ భారతి, సీనియర్ అధ్యాపకులు బాబు, సునీల్ కుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని సీనియర్ సిటిజన్లను సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యు సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో..

శ్రీకాళహస్తి: మున్సిపల్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. సీనియర్ ఓటర్లను కమిషనర్ బాలాజీనాయక్ సన్మానించారు. బీఎల్‌వోలు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాపానాయుడుపేటలో మానవహారం

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో బుధవారం సర్పంచ్ లలిత, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం జరిగింది. ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పానాయుడుపేటలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. సచివాలయంలో సీనియర్ ఓటర్లను సన్మానించారు. వైఎస్సార్ సీపీ మండల నాయకుడు కరుణాకరన్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి కేశవ రావు, పంచాయతీ కార్యదర్శి బాలసుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

ఓటు సామాన్యుని హక్కు

నారాయణవనం: ప్రజాస్వామ్యంలో సమర్థుడైన పాలకున్ని ఎన్నుకునే హక్కు ప్రతి పౌరునికి ఉందని డీఈఓ శేఖర్, తహసీల్దార్ ప్రమీళ తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా బుధవారం ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ ప్రమీళ మాట్లాడుతూ 18 ఏళ్లు పూర్తయిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును భారత రాజ్యాంగం కల్పిస్తోందన్నారు. వీఆర్వోలు తమ పరిధిలో కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను పర్యవేక్షించి, సకాలంలో పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా స్థానికులతో ప్రతిజ్ఞ చేయించారు.

సత్యవేడులో..

సత్యవేడు: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి అన్నారు. రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో తహసీల్దారు టీవీ సుబ్రమణ్యం అధ్యక్షతన జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్‌ఐ పురుషోత్తంరెడ్డి, సర్పంచ్ మంజుల, రమేష్ పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందించారు. ఎన్నికల డీటీ వెంకటేశ్వరు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: ఓటు వజ్రాయుధం లాంటిదని, దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని వరదయ్యపాళెం జూనియర్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తెలిపారు. కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అలాగే హైస్కూల్‌లో హెచ్‌ఎం మోహన్‌బాబు ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్లను సత్కరించారు.

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు: జెడ్పీ హైస్కూల్‌లో ఓటరు దినోత్సవం సందర్భంగా తహసీల్దారు మధుసూదన్ రావు ఓటు హక్కు ఆవశ్యకతను వివరించారు. సీనియర్ సిటిజన్‌లను సన్మానించారు. ఎంఈఓ హేమమాలిని, హెచ్‌ఎం యుగంధర్ రాజు, డిప్యూటీ తహసీల్దారు వెంకటేశన్ పాల్గొన్నారు.

ఓటు ప్రతి పౌరుడి హక్కు



బుచ్చినాయుడుకండ్రిగ: ఓటు హక్కు ప్రతి పౌరుడి హక్కు అని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు అన్నారు. బుధవారం ఆయన జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యాలయంలో ఓటు ప్రాముఖ్యత గురించి వివరించి, సీనియర్ మహిళా ఓటరును ఘనంగా సన్మానించారు. ఎంఈఓ రవీంద్రనాథ్, హెచ్‌ఎం విజయకుమారి,పాల్గొన్నారు. కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రమణయ్య ఆధ్వర్యంలో. ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ర్యాలీ నిర్వహించారు.

సర్వజన సంక్షేమం.. జగనన్న ధ్యేయం



సంక్షేమ బావుటా బుక్‌లెట్ అందజేస్తున్న అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: రాష్ట్రంలో వివక్షకు తావులేకుండా సర్వజనులకు సంక్షేమాన్ని నేరుగా అందించడమే ధ్యేయంగా సీఎం జగనన్న పని చేస్తున్నారని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. బుధవారం ఆయన మండలంలోని కొండలచెరువులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆయన అనంతరం ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేసి మహిళలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ పార్టీ వారైనా సరే వివక్ష లేకుండా సమానంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్న గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వం వచ్చిన మొదటిరోజు నుంచే టీడీపీ కార్యకర్తలకు మాత్రమే పని చేయాలని అప్పట్లో మాజీ సీఎం చంద్రబాబు బాహాటంగానే ప్రకటించారని గుర్తు చేశారు.

ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలను కొండలచెరువు గ్రామస్తులు తీసుకొచ్చారు. నడివీధిలో తాగునీటికి ఇబ్బందిగా ఉందని చేతిబోరును వేయాలని కోరారు. సుద్దగుంటలో డ్రైనేజీ కాలువలు, నిరంతర విద్యుత్ సౌకర్యం కల్పించాలని అక్కడి మహిళలు కోరారు. జాతీయ రహదారి నుంచి కొండలచెరువు గ్రామానికి సుమారు కిలో మీటరు దూరం వీధిదీపాలకు లైన్లు ఏర్పాటు చేయాలని కోరారు. రాజీవ్‌నగర్‌కు శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆదిమూలం మండల పరిషత్ నిధులతో బోరు తవ్వించాలని ఆదేశించారు. వీధిదీపాల ఏర్పాటుతో పాటు నిరంతర విద్యుత్‌కు తక్షణం చర్యలు తీసుకోవాలని, వారంలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి, మండల కన్వీనర్ సొరకాయలు, సర్పంచ్ భూపాల్‌రెడ్డి, తహసీల్దార్ ప్రమీళ, ఎంపీడీఓ గుణశేఖర్, మండలస్థాయి అధికారులు, పార్టీ నాయకులు పళనిరెడ్డి, మునిస్వామిరెడ్డి, అర్జున్‌రెడ్డి, కుమార్, గోపి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, డ్వాక్రా మహిళలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీపాద శ్రీవల్లభస్వామికి సాదర స్వాగతం



స్వామిజీకి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, భక్తులు

రేణిగుంట: శ్రీపాద శ్రీవల్లభ సంస్థానాధీశులు వెంకట విశ్వనాథంస్వామికి రేణిగుంట మండలం ఎల్లమంద్యం యోగానంద కళాశాల సమీపంలో ఘన స్వాగతం లభించింది. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డితో కలసి ఆయన ఏర్పేడు మండలం గుడిమల్లం వెళుతుండగా రేణిగుంట మండలానికి చెందిన వారు పెద్దసంఖ్యలో అక్కడకు చేరుకుని స్వామివారి ఆశీర్వచనాలు పొందారు. రేణిగుంట ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, మన్యం శ్రీనివాసులురెడ్డి, జువ్వల దయాకర్‌రెడ్డి, సర్పంచ్ నగేషం, మండల కోఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజ, గంగయ్య తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

త్రిశూల స్నానం ఏర్పాట్ల పరిశీలన

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం ఆధ్వర్యంలో మాఘ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని స్వర్ణముఖి నదిలో నిర్వహించే త్రిశూల స్నాన ఏర్పాట్లను బుధవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. జలవినాయకస్వామి ఆలయం సమీపంలోని స్వర్ణముఖి నదిలో పంచమూర్తులను కొలువుతీర్చి పూజలు నిర్వహించడానికి ఇంజనీరింగ్‌శాఖ ఆధ్వర్యంలో శాశ్వత వేదిక నిర్మాణం చేపట్టారు. అంజూరు శ్రీనివాసులు మాట్లాడుతూ నదిలో పుష్కరుడు కొలువు దీరినవేళ సర్వేశ్వరుడు త్రిశూల రూపంలో స్నానం ఆచరించేందుకు ప్రత్యేక కొలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. త్రిశూల స్నానం సమయంలో భక్తులు స్నానమాచరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.



త్రిశూల స్నానం ఏర్పాట్లు పరిశీలిస్తున్న పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు

బాలికలకు ఆత్మస్థైర్యం అవసరం

నారాయణవనం: కిశోర బాలికలు ఆత్మస్థైరాన్ని పెంచుకుని సమస్యలను సమయస్ఫూర్తిగా ఎదుర్కోవాలని రూరల్ సీఐ సురేష్‌కుమార్ సూచించారు. బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు పోటీపడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా మహిళలకు చట్టాలను, దిశ యాప్ ఉపయోగాలపై ఎస్‌ఐ పరమేశ్ నాయక్ వివరించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన బాలికలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శశికళ, పీఎంసీ చైర్‌పర్సన్ శ్రీవల్లీ చీరాలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బహుమతి అందిస్తున్న హెచ్‌ఎం శశికళ

ఉత్తమ బీఎల్‌ఓగా ఫాతిమా

గంగాధరనెల్లూరు: జీడీనెల్లూరు వీఆర్వో రూహీఫాతిమా ఉత్తమ బీఎల్‌ఓగా ఎంపికయ్యారు. బుధవారం అమరావతిలో ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆమెకు అవార్డు,షీల్డు అందజేసి, అధికారులు సన్మానించారు. నూ టికి నూరుశాతం ఓటర్లను నమోదు చేయడం, మృతి చెందిన వారి పేర్లను తొలగించడంతో ఉత్తమ బీఎల్‌ఓగా ఎంపికైనట్లు తహశీల్దారు ఇన్బనాథన్ తెలిపారు.

శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించండి

శ్రీకాళహస్తి: మున్సిపల్ పరిధిలోని 21, 22, 23, 24, 25వ వార్డుల్లో బుధవారం తూర్పు రాయలసీమ పట్టభద్రుల వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ నాయకులు ప్రచారం చేశారు. పట్టభద్రులు ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. నాయకులు జలదంకి మోహన్‌రెడ్డి, ఎంఆర్ మురళి, శంకర్, శరవణ, జిలానీబాషా, బావాజీ, పెరుమాళ్, వెంకటేష్‌బాబు పాల్గొన్నారు.



ప్రచారంలో వైఎస్సార్ సీపీ నాయకులు

మేకల దొంగల అరెస్టు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని బీడీ కాలనీ క్రాస్ రోడ్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటోలో దొంగతనంగా మేకలను తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు తొట్టంబేడు ఎస్‌ఐ రాఘవేంద్ర తెలిపారు. విచారణలో బుచ్చినాయుడుకండ్రిగ మండలానికి చెందిన నగేష్, రవితేజ, భానుప్రకాష్‌గా గుర్తించి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. సిబ్బంది వెంకటరమణ, నరసింహులు, అరుణ్, గంగా కుమార్, రవిచంద్ర, యుగంధర్, మురళి పాల్గొన్నారు.



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు